
# మగవాళ్లూ! ఊకుజోవర్లు!!

సి. హెచ్. సుశీల




శ్రీ బాలసుబ్రహ్మణ్యంగారికి,

నేను మీ యింట్లోంచి, అదే మీ జీవితంలోంచి విడిగా వచ్చేసి రెండు రోజులైంది. అంతే కాదు, మన పెళ్ళయి ఈ రోజుకి రెండేళ్ళు. నేనిలా వచ్చేయడం మీకు ఆశ్చర్యాన్నే కల్గించిందో, కోపాన్నే కల్గించిందో, అసహ్యాన్నే కల్గించిందో—నాకనవసరం. 'బరితెగించింది' అని గట్టిగా అనుకుని వుంటారు మనసులో. ఆమాట నాకేం కొత్త కాదుగా! మన పెళ్ళయిన ఈ రెండేళ్ళలో మీచేత ఆ మాట ఎన్నిసార్లు అన్పించుకున్నానో! ఆడదానికి మనసుండడం, దానికో స్వంత వ్యక్తిత్వ ముండడం మీ దృష్టిలో 'బరితెగించడం' అయితే, యిక మిమ్మల్ని ఆ భగవంతుడు కూడా రక్షించ లేడు. నిజం చెప్పాలంటే మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంటుంది.

సంసారం గురించి ఎన్నో మధురమైన ఆలోచనలతో మీ జీవితంలోకి అడుగు పెట్టాను నేను. అయితే అవన్నీ తలక్రిందులై పోవడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. చాలామంది ఆడపిల్లల్లా నేనేం గాలిలో మేడలు కట్టుకోలేదు. ఎంతో అందమైనవాడు, నవలా నాయకుడు నా కోసం దిగివస్తాడని, పెద్ద బంగళా, కారు, నగలు కావాలని నేనెప్పుడూ కలలు కనలేదు. అసలు మన పెళ్ళి నిశ్చయమయ్యే వరకూ పెళ్ళి గురించిన ఆలోచనలే నాకు లేవు. ఇంటర్ ఫస్ట్ క్లాస్‌లో పాసయిన నన్ను ఎంత బ్రతిమిలాడినా మెడికల్ ఎంట్రన్స్‌కి పంపలేదు అమ్మా నాన్న. పెళ్ళి చేసేయాలని అమ్మ పట్టుదల. బాగా చదువుకోవాలని నా కోరిక. నాన్నకి రెండూ సమంజసమే అన్పించాయి. ఎప్పుడు సంబంధం కుదిరితే అప్పుడే చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టేయాలనే షరతు మీద బి. యే.లో చేరాను చివరికి. సైన్స్ మీద యిక యింటరెస్ట్ పోయి ఇంగ్లీషు లిటరేచర్ తీసుకున్నాను. నాకింత ఈస్తటిక్ సెన్స్, ప్రతి చిన్న విషయానికీ కదిలిపోయే సున్నితమైన మనసు పెరగడానికి లిటరేచర్ చదవడమే కారణమేమో! వర్డ్స్‌వర్త్ ప్రకృతి తత్వాన్ని, షెల్లీ ప్రేమతత్వాన్ని ఎంతో తన్మయత్వంతో చదివేదాన్ని. లెక్చరర్ ఒథెల్లో గురించి చెప్తుంటే 'అబ్బ. ఇంతటి రాక్షసులు కూడ వుంటారా' అని ఒళ్లు జలదరించేది. క్లాసుపుస్తకాలేకాక-ఇంగ్లీషు, తెలుగు సాహిత్యాలను బాగా చదివేదాన్ని. కాని అంతలో అనుకోకుండా మీ సంబంధం కుదిరిపోయింది. మాఘమాసంలో మన పెళ్ళి జరిగిపోయింది. మరో మూడు నెలల్లో పరీక్షలు. నా మనసు కొట్టుకుపోయింది. కాని గత్యంతరం లేక పుస్తకాల్ని అటకెక్కించి చదువు నుండి నా దృష్టిని మరల్చుకున్నాను.

పెళ్ళి చూపులనాడు మిమ్మల్ని చూసి నేను సంతోషించాననే చెప్పాలి. 'అతను బాగా నలుపు' అని అమ్మావాళ్ళు గొణిగినా నేనేం పట్టించుకో లేదు. 'ఆ నలుపులో అదోరకమైన ఆకర్షణ వుంది. ముఖ్యంగా సూటిగా చూసే ఆ కళ్ళు, పొడవాటి ముక్కు చాలా బాగున్నాయి' అనుకున్నాను.

"అమ్మాయిని ఏమైనా అడుగుతావా" అని పెద్దవాళ్ళు మిమ్మల్ని అడుగుతుంటే నేను చాలా భయపడ్డాను. కంగారుగా చలిస్తున్న నా కళ్ళను ఓ క్షణం చూసి నా భయం అర్థం చేసుకున్నట్టు "ఏం అవసరం లేదు" అని మీరనడం విని మీరంటే గౌరవం పెరిగింది. బాగా చదివేవాళ్ళంటే నాకు చాలా గౌరవం. మీరు బి.కాం. పాసయ్యారని తెలిసి 'గ్రాడ్యుయేట్ అవడం అంటే ఎంత అదృష్టం' అనుకున్నాను నా చదువును తలచుకుని నిట్టూరుస్తూ. చదువుకున్నవాళ్ళకి ఎంతో సంస్కారం వుంటుందని తలచిన నేను ఆ అభిప్రాయం తప్పేమోనని మన మొదటిరాత్రే అనుకున్నాను.

అప్పటివరకు నేను జీవితం గురించి మధురమైన

ఊహలు, అందమైన ప్రణాళికలు వేసుకున్నాను. నేను నా చుట్టూ ఎన్నో సంసారాలు చూసాను. చాలా సంసారాల్లో భార్యాభర్తల మధ్య సరయిన అవగాహన లేక చీటికీమాటికీ తగవులాడుకోవడం, ఒకరి మీద ఒకరు నిర్లక్ష్యం ద్వేషం పెంచుకోవడం, ఏదో పెళ్ళయింది కాబట్టి సంసారం చేస్తున్నాం అన్నట్లు యాంత్రిక జీవితాన్ని గడపడం చూసి నేను మన సంసారం గూర్చి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను.

నా భర్తకి అనుగుణంగా నడుచుకోవాలి. అతనితో ఎప్పటికీ పోట్లాడకూడదు. ఇద్దరూ ఒకరి అభిప్రాయాల్ని ఒకరు మన్నించుకోవాలి. అరమరికలు వుండకూడదు. అతని మనసంతా నేనే నిండిపోవాలి. నేను డిగ్రీలు చదువకపోయినా, మా యిద్దరి అభిరుచులకు అనుగుణంగా కాపురాన్ని తీర్చి దిద్దుకోవాలి. 'ఛీ ఈ పెళ్ళి చేసుకోకపోయినా బాగుండేది' అని నా భర్త ఎప్పటికీ మనసులో అనుకునే పరిస్థితి రాకూడదు. 'ఇలాంటి భార్య దొరకడం నా అదృష్టం' అని అతను పొంగిపోవాలి. ఇవీ నా నిర్ణయాలు. కావి మన పెళ్ళయిన కొద్ది రోజులకే ఆ నా నిర్ణయాలన్నీ జరిగేవి కావని తెలుసుకోగానే నా గుండె పగిలి పోయినట్లయింది.

మొదటి రాత్రి ఎన్నో మధురమైన ఊహలతో సిగ్గుపడుతూ నిల్చున్నాను నేను. మీరు ఓక్షణం దీర్ఘంగా నన్ను చూసారు.

"ఈ చదువుకున్న ఆడపిల్ల కూడా సిగ్గుపడ్తుందన్నమాట" అన్నారు మీరు. "చదువుకుంటే మాత్రం ఆడపిల్ల ఆడపిల్ల కాకుండా పోతుందా" అనుకుని మెల్లగా నవ్వుకున్నాను నేను.

"అలా నటించకు. నటించే వాళ్ళంటే నాకు అసహ్యం" అంటూ చెయ్యిపట్టి లాగి నన్ను మంచం మీద కూర్చోబెట్టారు మీరు.

బిత్తరపోయాను నేను. నటిస్తున్నానా?? కంగారుపడ్డాను.

నా ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని, ఓ క్షణం పరిశీలనగా చూసి, ముద్దు పెట్టుకుంటూ "నువ్వు అందంగా వుంటావు" అన్నారు మీరు.

నా కంగారు తగ్గి మళ్ళీ మామూలుగా అయిపోయాను.

ఓ అరగంట పోయాక—

లేచి కూర్చొని సిగరెట్టు ముట్టిస్తూ "చూడు నేనో విషయం అడుగుతాను. నిజం చెప్తావా''— అన్నారు మీరు.

"మీతో నాజన్మలో అబద్ధం ఆడను" అన్నాను దృఢంగా.

"అయితే, నీ గతం గురించి వివరంగా చెప్పు" అడిగారు.

"నా గతమా! ఇల్లు, చదువు తప్ప నాకేం చెప్పుకోదగ్గ గతంలేదు" అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

"కాలేజీలో చదివిన పిల్లలకు ఫ్రెండ్స్.... ప్రేమా.......''

"ఊహూ. అలాంటివేం లేవునాకు" అన్నాను గర్వంగా.

మీరు సరదాగా అడుగుతున్నారని అనుకున్నాను గాని మీలో భయంకరమైన అనుమాన పిశాచి వుందని అప్పుడు గ్రహించలేక పోయాను. అదే కాదు. మీరు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో కూడా బాధపడ్తున్నారని తర్వాత్తర్వాత తెలుసుకున్నాను.

"నువ్వు అందంగా వున్నావు'' అని మీరు పదే పదే అంటుంటే పొంగిపోయి మురిసిపోయాను గాని మీ మాటల్లోని గూఢార్థాన్ని కనుక్కోలేకపోయాను. చివరికి మీరు బైటపడిపోయారు.

"నువ్వింత అందంగా వున్నావు. మరి నాలాంటి నల్లటివాణ్ణి ఎందుకు చేసుకున్నావు'' అన్నారు మీరు.

"ఈ అందమైన ముక్కుని చూసి" అన్నాను నవ్వుతూ, మీ ముక్కు పట్టుకుని వూపుతూ. అప్పటికింకా మీ మాటల్ని సీరియస్‌గా తీసుకోలేదు నేను.

కాని త్వరలోనే తెలుసుకున్నాను మీ మనసు నిండా ఇన్ఫీరియారిటీ, అనుమానం నిండి వున్నాయని.

'ఇంత అందంగా వుండి నాలాంటి నల్లనివాణ్ణి ఎందుకు చేసుకుంది? నిజంగా ఈమెకి ఎలాంటి గతం లేదా? కాలేజీలో ఎవర్నీ ప్రేమించకుండానే వుందా? ఇంత అందమైనదానికి ప్రేమలేఖలు రాకుండా వుంటాయా? ఎవరితోటీ పరిచయం పెరగకుండా వుంటుందా? లేదు. ఎవర్నో ప్రేమించే వుంటుంది. ఈ విషయం ఇంట్లో తెలిసి ఎలాంటివాడో ఒకడు దొరికితే అంతేచాలని నాలాంటివాణ్ణి చేసివుంటారు'—ఇంత నీచమైన ఆలోచనలు మీలో వున్నాయని తెలుసుకుంటున్న కొద్దీ నా మనసు చిన్నాభిన్నమైపోసాగింది. ఛీ ఛీ అలాంటి ఆలోచన్లని తలుచుకుంటేనే అసహ్యమేస్తుంది నాకు.

ఆడదంటే మీకెందుకంత తేలిక భావం? ముఖ్యంగా చదువుకున్న ఆడవాళ్ళందరికీ శీలం వుండదని ఎందుకు అనుకుంటారు? దీనికంతటికీ కారణం మీలోని కాంప్లెక్స్. మీరు చదువుకునే రోజుల్లో ఏ ఆడపిల్లా మీతో పరిచయం చేసుకోలేదు. మీరూ వాళ్ళకి దూరంగానే వుండిపోయారు. కాని ఆడపిల్లలు మగపిల్లలు కలిసి సరదాగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటుంటే మీకు ఒళ్ళుమండిపోయేది.

'నేను బాగుండను. అందుకే నాతో ఎవ్వరూ మాట్లాడరు' అన్న ఇన్ఫీరియారిటీ పెరిగిపోయింది మీలో. దానికితోడు యింట్లో కూడ మీకు చిన్నచూపే ఎదురైంది. మీ అన్నయ్య తెల్లగా, అందంగా, చురుగ్గా వుండేవాడు. మీ అమ్మానాన్న మొదట పుట్టినవాడని అతన్ని కాస్త ఎక్కువగానే ముద్దుచేసి వుంటారు. ఇంట్లోని నిరాదరణతో మీరింకా ఒంటరిగా ఫీలయ్యేవారు. అక్కాచెల్లెళ్ళు లేరు కాబట్టే మీకు యింట్లో కూడ ఆడపడుచు సాహచర్యం లేదు. మీకు పదహారేళ్ళప్పుడు మీ అమ్మగారు కూడా పోయారు. మీ అన్నయ్యకి అన్నీ ఫస్ట్‌క్లాసులే. పెరిగిపోతున్న న్యూనతా భావంతో మీరు మామూలుగా పాసవ్వడమే గగనమైపోయింది. ఇంటరు, బి. కాం. కూడ పాస్ మార్కుల్తో పాసయ్యారు మీరు. మీ నాన్నగారు చెప్పిన కొన్ని విషయాలకి నా ఆలోచన జోడించి మీ మనస్తత్వాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించాను.

"ఇంటర్‌లో ఫస్టు క్లాసని తెలుసులే. ఊరికే పెద్ద తెలివితేటలు ఒలకపొయ్యకు'' అని మాటల్తో నన్ను గుచ్చిగుచ్చి బాధ పెట్టినా, మీ ఆ మనస్తత్వానికి కారణాలు తెలుసు కాబట్టి మీ బాధ అర్థం చేసుకుని జాలిపడ్డానే కాని కోపం తెచ్చుకోలేదు నేనెప్పుడూ.

పెళ్ళయిన కొత్తల్లో ఒకసారి అడిగాను నేను చాలా సిగ్గుపడుతూ "మీరు నన్ను పేరు పెట్టి సుజాత అనో, సుజా అనో పిలవరెందుకని? ఇదుగో చూడు నిన్నే అని పిలుస్తారేం'' అని.

మీరు నొసలు చిట్లించి "ఇంట్లో ఇద్దరే వున్నాం. ప్రత్యేకంగా నిన్ను పేరు పెట్టి పిలవాలా? అయినా నీ కోరికలన్నీ యింత విచిత్రంగా వుంటాయేం? ఓహో కాలేజీలో వెలగబెట్టిన

[80 వ పేజీ చూడండి]

[మగవాళ్లూ మీకు జోహార్లు!! : 75 వ పేజీ నుంచి]

తెలివా ఇది! సుజా గిజా అని ముద్దుముద్దుగా పిలుచుకుంటూ, డ్యూయెట్లు పాడుకుంటూ గెంత డానికి యిది సినిమా కాదు. కలల్లో తేలిపోక వాస్తవంలో నిలబడు" అంటూ సీరియస్‌గా నేనేదో మహాపరాధం చేసినట్టు లెక్చరిచ్చారు.

నేను తెల్లబోయాను. భార్యను ప్రేమగా పేరు పెట్టి పిలవమనడం విచిత్రమైన కోరికా? నేను మనిషిని కాదా? గోడనో కుర్చీనో ఉద్దేశించి మాట్లాడినట్టు కాక, 'సుజా' అని పిలిచి నాతో మాట్లాడవచ్చుగా! భర్తని అలా కోరడం కలల్లో తేలిపోవడమా? మీ ఆలోచనలన్నీ యింత ఇరుకుగా వుంటాయేం? పైగా నేనేమైనా అంటే "ఓహో నీవి చాలా విశాలమైన భావాలు కదూ! కాలేజీలో చదివావు, పైగా ఫస్ట్‌క్లాసాయె" అంటూ వ్యంగ్యంగా బాణాలు విసురుతారు.

మీరెన్ని మాటలన్నా సహనంతో ఓర్చుకునే దాన్ని కాని, ఎన్నడూ పల్లెత్తుమాట అనలేదు మిమ్మల్ని. ఓహో ఎన్ని భయంకరమైన అనుభవాలు ఈ రెండేళ్ళలో! ఎన్ని సంఘటనలు! ఎన్ని అవమానాలు! ఎన్ని హేళనలు! ఎన్ని చీవాట్లు చీదరింపులు! ఎన్ని బాధలు!

ఒక రోజు మా ఫ్రెండ్స్ వచ్చారు మనింటికి. మిమ్మల్ని పరిచయం చేస్తే ముభావంగా ఏవో రెండు మాటలు మాట్లాడి ప్రక్క గదిలోకి వెళ్ళి పోయారు. మేమేదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాం. వాళ్ళు బి. ఏ. రెండవ సంవత్సరంలోకి వచ్చారు. మాటల మధ్యలో విమల అంది. "ఏయ్ సుజా! లాస్టియర్ రిప్రజెంటేటివ్‌గా నిలబడి ఓడిపోయాడే ఆనంద్, ఇప్పుడతను సెక్రటరీగా నిలబడుతున్నాడు. ఈసారి గెలిచేట్టు వున్నాడులే. చాలా మంచి భావాలు వున్నవాడు కదూ! మనం దరం కాన్వాస్ చేసినా ఓడిపోయాడు పోయినసారి"

"ఆనంద్ చాలా మంచివాడు" అన్నానేను.

"ఫస్టియర్ పరీక్షఫీజు కట్టలేక దిగులు పడ్తుంటే ప్రిన్స్‌పాల్‌గారు అతని ఫీజు కట్టారు తెలుసా" అంది సరోజ.

ఆ తర్వాత కొద్దిసేపటికి వాళ్ళు వెళ్ళిపోయారు. చాలా రోజులకి వాళ్ళందర్నీ చూసిన ఆనందంలో వున్న నేను మీ ముఖంలో మారుతున్న రంగుల్ని చూడలేకపోయాను. మీకు అన్నం వడ్డిస్తూ వాళ్ళ గురించే చెప్పసాగాను. మీరు అతికష్టం మీద కోపాన్ని ఆపుకుంటున్నారని తెలీదు నాకు.

ఉన్నట్టుండి కంచాన్ని గట్టిగా ఎత్తి పదేసా మీరు. నా వంటినిండా అన్నం చిందిపడింది. కళ్ళలో పులుసు పడి మండుతున్నాయి కళ్ళు. నేను మీ కోపానికి కారణం తెలీక ఆశ్చర్యంగా, చూస్తున్నాను. ఎప్పుడూ యిలాంటి అనుభవం తెలీదు నాకు. ఒక్కగానొక్క కూతుర్నని గట్టిగా కోప్పడి కూడా ఎరగరు అమ్మా నాన్న. అందుకే మీరు కోపంగా అరుస్తే విపరీతంగా భయపడి పోయేదాన్ని.

"ఏమిటా తన్మయత్వం? అంత ఒళ్లుపోయి తెలీడం లేదా? నెయ్యి రెండుసార్లు అడిగినా విన్పించలేదా? అవున్లే, ఆనంద్‌గాణ్ణి తలుచుకుంటుంటే చెవులేం పనిచేస్తాయి" నన్ను ఒక్క తోపు తోసేసి వెళ్ళిపోయారు మీరు. ఏమనాలో, ఏంచెయ్యాలో తోచనట్టు నిలబడిపోయాను నేను.

ఆ ఆనంద్‌ని అంత తేలిగ్గా వదలలేదు మీరు. ఆ రాత్రి.

"ఎవరా ఆనంద్? నీకూ అతనికీ ఏం సంబంధం? అతని తరఫున కాన్వాస్ చేసేంత ప్రేమా అతనిపై?" అంటూ నన్ను వేధించారు. నాలో రోషం, అభిమానం వుప్పెత్తున లేచాయి. భరించలేనంత బాధ గుండెల్ని కోసేస్తోంది. ఏమీ లేదని ఎంతచెప్పినా మీరు నమ్మలేదు. ఇక ఆరోజు నుండీ చీటికీ మాటికీ ఆనంద్ పేరు ఎత్తి నన్ను చిత్రవధ చేస్తూనే వున్నారు. నచ్చజెప్పినంత సేపు చెప్పి యిక విసుగెత్తి నేను మౌనంగా మీ తిట్లన్నీ భరించేదాన్ని.

ఎప్పటి తప్పుడు మీ తిట్లన్నీ మర్చిపోయి, మిమ్మల్ని ప్రేమించాలని ఎంతో ప్రయత్నించే దాన్ని. ఒకరోజు గుడికెళ్ళి వచ్చాను నేను. మనసంతా ప్రశాంతంగా వుంది. కష్టాల్ని భరించే సహనాన్ని, నా భర్తని ప్రేమించే శక్తిని, నా సంసారాన్ని చక్కదిద్దుకునే నేర్పునూ, ధైర్యాన్ని ఇవ్వమని అమ్మవారిని వేడుకొని వచ్చాను. విచిత్రం ఏమిటంటే ఆరోజు ప్రొద్దుటినుండీ మీరు నన్నేం అనలేదు. ఆ చిన్న విషయానికే నా మనసెంతో పొంగిపోయింది. ఏమిటో చాలా ఆనందంగా, ఉత్సాహంగా అన్పించింది. ఆ రాత్రి మీ గుండెల మీద తలపెట్టుకుని పడుకున్నాను. "లేచి సరిగ్గా పడుకో" అన్నారు మీరు చిరాగ్గా. మీకు అలాంటి సున్నితమైన భావాలు లేవని నాకు తెలుసు కాని ఆరోజు నేను ఆదోలోకంలో వున్నాను కదా!

"నాకిలాంటి వేషాలంటే చిరాకు. నీ తల వెంట్రుకలు నా ముక్కుల్లో దూరుతున్నాయి. నా మీద పడకు" అన్నారు.

ఒక్కసారిగా నా మధురమైన లోకంలోంచి వాస్తవంలోకి వచ్చి పడ్డాను. 'అబ్బ. మీ హృదయం ఎంత పాషాణం! దానికి స్పందన, సున్నితత్వం, భావుకత అన్నది లేనేలేవా' అన్నట్టు మీ ముఖంలోకి చూసాను.

అయినా నవ్వుతూనే అన్నాను — "ఏయ్ బాలూ! నువ్వు ఎన్ని అన్నా నువ్వంటే నాకు ప్రేమ తగ్గడం లేదేమిటి?"

మీరు ముఖం చిట్లించారు. "బాలూ ఏమిటి బాలూ? నాపేరు బాలసుబ్రహ్మణ్యం. అమ్మ



కంభంపాటి విజయలక్ష్మి

శ్రీమతి కంభంపాటి విజయలక్ష్మి, వరంగల్ జిల్లా ఏటూరు – నాగారం, సమితి స్త్రీ–శిశుసంక్షేమ స్థాయీ సంఘం ఛైర్మన్‌గా, ఇటీవల ఎన్నికయ్యారు. ఇంకా తాలూకా ఫుడ్ కమిటీ, ఆర్థిక స్థాయీ సంఘాలలో సభ్యురాలుగా వుంటున్న విజయలక్ష్మి, స్వగ్రామం కృష్ణా జిల్లా కుమ్మమూరు. జగ్గయ్యపేటలో డిగ్రీ విద్య తదనంతరం, వరంగల్ జిల్లాలో అక్కినేపల్లి మల్లారంలో వుంటున్నారు. భర్త శ్రీకోటేశ్వరరావు.

వ్యవసాయం, సాంఘికసేవ, కార్యక్రమాలలో పాల్గొనడానికి అధికోత్సాహం చూపే, విజయలక్ష్మి రాజకీయ రంగంలో కూడా ప్రవేశించి, తన చొరవతో స్త్రీ సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

—విజయవాడ విలేకరి

సుబ్బు, సుబ్బులు, సుబ్బాయ్ అనేది. అందరూ సుబ్రహ్మణ్యం అంటారు. బాలు ఏమిటి? అయినా మొగుణ్ణి ఏకవచనంలో, పేరుపెట్టి పిలిచేంత బరితెగించిపోయావా'' తీవ్రంగా అన్నారు మీరు.

బిక్క చచ్చిపోయాను నేను. నా మత్తు పూర్తిగా దిగిపోయింది. ఎంత సంకుచితత్వం! కొన్ని మధురమైన సన్నివేశాల్లో, తన్మయత్వంతో కూడ భార్య భర్తని ఏకవచనంలో పేరుపెట్టి పిలవకూడదన్న మీ నీచమైన అభిప్రాయం చూస్తే అసహ్యమేసింది నాకు. చాల విరక్తిగా అటు తిరిగి పడుకున్నాను.

ఒకసారి ఏదో ఆఫీసు పనిమీద మీ అన్నయ్య మనవూరు వచ్చి మనింటికి వచ్చారు. మీ అన్నయ్య గారు కదాని ఎంతో భయభక్తుల్తో నేనాయనకి మర్యాదలు చేసాను. 'నాన్న ఎలా వున్నారు' అని మీరు అడగకపోయినా 'మామయ్యగారి ఆరోగ్యం ఎలా వుంది? అక్కయ్య బావున్నారా? తీసుకు రావాల్సింది' అంటూ నేను కుశలప్రశ్నలు వేసాను.

అసలు మీ అన్నయ్యని చూస్తూనే మీరు కుంచించుకుపోయారు. అతనిముందు 'నేను చాల అల్పుణ్ణి' అన్న న్యూనతాభావంతో, బిగివుగా వున్న అతనివైపు ద్వేషంగా చూడసాగారు మీరు. పైగా నేను ఆయనతో ఆప్యాయంగా మాట్లాడుతుంటే మీకు మరీ చిరాకు ఎక్కువైంది. ఆ సాయంత్రం ఆయన వెళ్తానంటే మాట మాత్రంగానైనా వుండమనలేదు మీరు.

"రాత్రి ప్రయాణం ఎందుకండి? రేపు ఫస్ట్ బస్సుకి వెళ్దురుగాని'' అన్నాను.

ఆయన వెళ్ళిపోయిన తర్వాత చెళ్ళున నా చెంప మీద కొట్టారు మీరు. నాకేం అర్థం కాక కళ్ళనిండా నీరు తిరిగింది.

"ఏం వాణ్ణి చూస్తే అంత ప్రేమ ఒలికి పోతోంది? మొగుడనే వెధవ యిక్కడే వున్నాడని కూడా లేకుండా ఏమిటా కబుర్లు? నిజమే. వాడి ముందు నేను వెధవనే. అంతమాత్రాన వాడిముందు నన్నంత తీసిపారేస్తావా'' గట్టిగా ఏమిటేమిటో అరుస్తున్నారు మీరు.

నా గుండెల్లో మంటలు లేస్తున్నాయి. రక్తం సలసలా కాగిపోతోంది. ఛీ. ఎంత నీచంగా ఆలోచిస్తాడీయన. స్వంత అన్నగారి మీదనే యింత ద్వేషమా! ఇంత యిన్ఫీరియారిటీ వుంటుందా!

"మాట్లాడవేం'' అంటూ నా జుట్టు పట్టుకుని మంచం మీదికి తోసారు. మంచం కోడు నుదుటికి బలంగా తాకింది. రక్తం కారసాగింది. ఎంత నిగ్రహించుకుందామన్నా నాలో అసహ్యం బైటికి తన్నుకు వచ్చేసింది.

"ఛీ ఛీ. మీరు మరీ యింత సంకుచితంగా ఆలోచిస్తారనుకోలేదు. స్వంత అన్నని, కట్టుకున్న పెళ్ళాన్ని అనుమానిస్తారా? అతను గొప్ప హోదాలో వుంటే వుండవచ్చు. అందంగా, హుందాగా వుంటే వుండవచ్చు. అంతమాత్రాన బుద్ధి లేకుండా, నీతి నియమం లేకుండా అతని వెంటపడ్తానని ఎలా వూహించారు మీరసలు? ఛీఛీ. ఏం మగవాళ్ళండీ! ఆడదీ మనిషేననీ, దానికో మనసుంటుందనీ ఎందుకు గుర్తించరు మీరు? మీలాంటి వాళ్ళ గురించే 'చెలం' అంతగా మొత్తుకున్నాడు'' అన్నాను.

"చెలమా? వాడెవడు? వాడికీ నీకు ఏమిటి సంబంధం'' అన్నారు మీరు అనుమానంగా చూస్తూ.

తెల్లబోయాన్నేను.

"చెలం తెలీదా'' అన్నాను ఆశ్చర్యంగా.

"నీ మాజీ ప్రియుళ్ళంతా నాకు తెలియాలని ఎక్కడుంది'' అన్నారు మీరు.

పక్కున నవ్వాన్నేను.

"ఎందుకానవ్వు సిగ్గులేకుండా'' అన్నారు నిరసనగా.

"చెలం ఎవరంటే....చెలం ...ఒక పిచ్చివాడు'' అన్నాను నవ్వుతూనే.

"ఎంత పొగరు! సిగ్గులేకపోతేసరి'' ఛీత్కారం చేస్తూ అవతలకి వెళ్ళిపోయారు మీరు.

నేను నవ్వి మంచంమీద పడిపోయాను. నుదుటి మీద గాయం చేసేమంట కంటే గుండెల్లో అయిన గాయం మండిపోతోంది. కోపంగా వుంది. కసిగా వుంది. బాధగా వుంది. అసహ్యంగా వుంది. చివరికి ఏం చెయ్యలేక, నిస్సహాయంగా, దీనాతిదీనంగా, దిక్కులేనట్టు, గుండెలు పగిలేలా అలా ఎంత సేపు ఏడుస్తూ పడివున్నానో నాకే తెలీదు.

మర్నాడు నేను చదువుతున్న చలం పుస్తకం లాక్కున్నారు మీరు. నేను మౌనంగా వంటింట్లోకి వెళ్ళాను. కొద్దిసేపటికి మీరు వంటింట్లోకి వచ్చి నావైపే తీక్షణంగా చూడసాగారు. నేను తికమకగా చూసాను.

"ఈ చెత్త పుస్తకాలు చదివి మీ ఆడవాళ్ళెందుకు చేతులారా జీవితాల్ని నాశనం చేసుకుంటారో అర్థం కావడం లేదు. ఏమిటి అతను చెప్పే స్వేచ్ఛ? ఏమిటట స్త్రీ వ్యక్తిత్వం? మొగాళ్ళని ఎదిరించి, వీధికెక్కి ఏం సాధిస్తార్ట మీరు'' హేళనగా అన్నారు.

"చెలం చెప్పిన స్వేచ్ఛ మీ కెప్పటికీ అర్థం కాదు లెండి'' మెల్లగా అన్నాన్నేను.

"నువ్వు బాగా అర్థం చేసుకుని ఉద్ధరిస్తున్నావుగా! ఇదుగో. నాకిలాంటి వంటే అసహ్యం. ఇంకోసారి ఇలాంటి పుస్తకాలు చదివావంటే తన్ని యింట్లోంచి గెంటేస్తాను. జాగ్రత్త''

మీది అజ్ఞానమా? అహంకారమా?

సరే. అప్పటికి సహనంగానే వూరుకున్నాను. మెల్లగా మిమ్మల్ని మార్చుకోవాలన్నదే నా ధ్యేయం. కాని మీరు ఏమాత్రం నాతో సహకరించే వారు కారు. నేను మంచిగా మౌనంగా వుండే కొద్దీ మీరు మరీ రెచ్చిపోయే వారు. నా ధైర్యం, వ్యక్తిత్వం చూస్తే మీకు మంటగా వుండేది. నేను ధైర్యం ఓర్పు కోల్పోయి ఏడ్చేవరకు మాటల్తో గుచ్చి గుచ్చి చంపేవారు.

కోల్పోతున్న ధైర్యం కూడగట్టు కుంటూ ఎలాగైనా నా కాపురాన్ని చక్కదిద్దుకుని, సుందర నందనంగా చేసుకోవాలనే నా ప్రయత్నంలో హఠాత్తుగా నాలో కొత్త ఆశాకిరణం.... నేను... నేను తల్లిని కాబోతున్నాను. నేను ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాను. మీరెలాంటి వారైనా కానీ, నన్నెంత కష్టపెట్టినా సరే—మీ రూపం నాలో పెరుగుతోంది. మనిద్దరి మధ్య చక్కని బంధం మన సంతానం.

ఎన్నో అందమైన ఊహల్తో, మధురమైన భావాల్తో మీ రాక కోసం ఎదురు చూడసాగాను. తలంటు పోసుకుని, తెల్ల చీర కట్టుకుని, తల నిండా మల్లె పూలతో మెరిసిపోతున్న కళ్ళతో, చిరునవ్వు వెలుగులతో వున్న నన్ను ఓ క్షణం చూసి మౌనంగా కాఫీ తాగసాగారు మీరు.

మీ ప్రవర్తనకి ఆ రోజు నేను చిన్నబుచ్చుకో దల్చుకోలేదు. మీకా వార్త చెప్పాలని ఎంతో ప్రయత్నించాను. కాని సిగ్గు ముంచుకొస్తోంది. ఎలా చెప్పాలి? ఏమని చెప్పాలి? సినిమాటిక్‌గా వుంటుందా? ఈ ఆలోచనల్తోనే మీకు భోజనం వడ్డించాను.

నేను వంటిల్లు సర్ది వచ్చాను. మీరు కుర్చీలో కూర్చొని పత్రికలో బొమ్మలు చూస్తున్నారు. ఎంత సేపటి నుంచో చెప్పాలని ప్రయత్నిస్తున్న నేను

యిక చెప్పేయాలని గట్టిగా అనుకున్నాను. మీ కుర్చీ వెనగ్గా నిలబడి, వెనకనుండి రెండు చేతులు మీ భుజాల మీదుగా వేసి, కుడిచేత్తో మీ ముఖాన్ని పైకెత్తి మీ నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాను.

మీరు ముఖం త్రిప్పుకుంటూ "ఏమిటీ వేషాలు" అన్నారు చిరాగ్గా.

నాకేమిటో గొంతు మూగబోయింది. గుండెల నిండా సంతోషం.

మీరు వెళ్ళి పడుకున్నారు. నేను వచ్చి మీ ప్రక్కనే పడుకున్నాను. మీ మీద చెయ్యి వేసి "ఓ విషయం చెప్పనా" అన్నాను.

"ఏమిటి?"

"నేను.... నేను... మీరు..."

"ఏమిటా సణుగుడూ?"

"మీరు తండ్రి కాబోతున్నారు" ఎలాగో చెప్పేసి, సిగ్గుతో చప్పున చేతుల్లో ముఖం దాచుకున్నాను. క్షణాలు గడిచిపోతున్నాయి. నేనూహించినట్టు మీరు ఎంతో ఆనందంగా నన్ను దగ్గరికి తీసుకోలేదు. ఏ విధమైన సంతోషాన్ని వ్యక్తం చేయలేదు. నేను ఆశ్చర్యంగా చేతులు తీసేసి మీ వైపు చూసాను.

మీరు ఓ క్షణం నన్ను చూసి "సరే, డాక్టర్ దగ్గరికి వెళ్తాందు" అన్నారు.

ఎలాంటి అనుభూతి, రసస్పందన లేని ఇలాటి నీరస జీవితాన్ని నేనసలు ఊహించలేదు.

అయినా నా ఆనందాన్ని దాచుకోలేక మీ మీద చెయ్యేసి దగ్గరగా జరిగాను. 'మీకు ఆనందంగా లేదా' అన్నట్టు విస్మయంగా చూసాను నేను.

"పడుకో" అన్నారు మీరు.

నా ముఖం మీద కొట్టినట్టయింది.

అయినా ఆ రోజు నా ఆనందాన్ని మీతో పంచుకోవాలనే నా కోరికని నేను చంపుకోలేక పోయాను.

"ఊహూ" అంటూ నవ్వుతూ మీ నుదుటి మీద చెంపల మీద ఎంతో ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నాను.

మీరు విసురుగా తోసేసారు. "ఏమిటీ భోగం వేషాలు! సంసారివనుకుంటున్నావా? సానివనుకుంటున్నావా?" అన్నారు కోపంగా.

మబ్బుల్లో విహరిస్తున్న నన్ను పాతాళంలోకి తోసినట్టయింది. నా మనసు ముక్కలు ముక్కలైంది. ఎంత అవమానం! ఇంతకంటే ఆడదానికి అవమానం యింకేం వుంటుంది! ఛీఛీ. ప్రొద్దుటి నుంచీ నాలో ఉప్పొంగుతున్న ఉత్సాహం ఆవిరైపోయింది. ఏమిటీ అడివిమనిషి! అసలు ఇతను మనిషేనా! ఏమిటీ, భోగం వేషాలా? ఎంత మాటన్నాడు!

ఆ రాత్రంతా నాకు నిద్రలేదు. మర్నాటికి తలంతా దిమ్మెక్కిపోయింది. అలానే లేచి పని చేసుకున్నాను. ఆ సాయంత్రం మీరు సినిమాకి వెళ్దామన్నారు. సామాన్యంగా మీరు సినిమాకి తీసుకెళ్ళరు. కాని ఆ రోజు నాకు వంట్లో ఏం బాగా లేక రాలేనన్నాను.

"సినిమా కెళ్తామని నేను పిలిస్తే ఏమిటా నీలుగుడు? ఎందుకంత పొగరు" అన్నారు కోపంగా మీరు.

మీ విసుర్లు వింటూ ఆ బాధ భరించేకంటే మూడుగంటలు ఎలాగో సినిమాలో కూర్చోవడమే నయమనిపించి బయలుదేరాను.

సినిమాలో రెండుసార్లు కరెంటు పోయింది. సినిమా వదిలేసరికి చాలా పొద్దుపోయింది. సిటీ బస్సులన్నీ వెళ్ళిపోయాయి. సన్నగా చినుకులు పడ్తున్నాయి. రిక్షాలో పోదామన్నాను. కాని రిక్షా వాడు చెప్పిన చార్జీ వినగానే మీరు బేరం చెయ్యక నడకసాగించారు. నాకు కళ్ళు తిరుగుతున్నాయి. అలానే సగం దూరం నడిపించారు. చలికి, జ్వరం తీవ్రతకి వణికిపోతున్నాను నేను. చివరికి గొణుక్కుంటూ రిక్షా మాట్లాడారు మీరు. ఒక ప్రక్క భార్య ప్రాణం పోయేలా బాధపడుతూంటే అర్ధరూపాయి కోసం బేరమాడే భర్త వుంటాడా ఎక్కడన్నా!

ఇంటికి వచ్చాక మీకు భోజనం వడ్డించేసి, నేను వణుకుతూ ముడుచుకుని పడుకున్నాను. బైట వర్షం బాగా పడుతోంది. మీరు వచ్చి నా ప్రక్కన పడుకుని నన్ను దగ్గరగా లాక్కున్నారు.

నేను ఉలిక్కిపడ్డాను.

"నాకు.... నాకు జ్వరం వచ్చిందండీ".

"ఊ. అయితే".

"ఈ రోజుకి వదిలేయండి నన్ను"

"ఊహూ"

"ప్లీజ్" దీనంగా అన్నాను.

"నోర్మూసుకో" బలవంతాన నన్ను ఆక్రమించుకున్నారు మీరు.

మీపట్ల నా మనసు పూర్తిగా విరిగిపోయింది. కసిగా, అసహ్యంగా తోసేయబోయాను. కాని మగవాడి బలం ముందు నిస్సహాయంగా, గత్యంతరం లేనట్టు ఓడిపోయాను. ఎంత రాక్షసత్వం! తన జోడుకి యిష్టం లేకపోతే జంతువు కూడ బలవంతం చెయ్యదే! అలాంటిది కట్టుకున్న భార్య జ్వరంతో బాధపడుతూ, ఒక్క రోజుకి వదిలేయమంటే, బలవంతంగా అనుభవించే కిరాతకుణ్ణి భర్తగా యింకా గౌరవించాలా?

హఠాత్తుగా నేను తెలుసుకున్నాను. ఇన్నాళ్ళూ మీలో నేను గుర్తించని 'శాడిస్ట్'ని ఆరోజు చూసాను. అవును. నిన్న ఎంతో ప్రేమతో



పి. శ్రీలత

గుంతకల్లు శ్రీ సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో మూడవ తరగతి చదువుకుంటూన్న బేబి పి. శ్రీలత స్థానిక శాస్త్రీయ, జానపద నృత్య శిక్షణ కేంద్రంలో కేంద్ర నిర్వాహకులు శ్రీ యమ్. అప్పారావుగారి వద్ద నాట్యం నేర్చుకుంటున్నది. ఇటీవల కడప శోభకళా పరిషత్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన నాట్య పోటీలో పాల్గొని కూచిపూడి, జానపద నాట్యాలలో ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నది.

—ఎ. అన్నపూర్ణ

మీకోసం దగ్గరికి చేరితే, 'ఇది కోరినప్పుడు దీని కోరిక ఎందుకు తీర్చాలి' అన్న పట్టుదల. ఓపిక లేనట్టు నీరసంగా వున్న నన్ను బలవంతాన సినిమాకి తీసికెళ్ళి నడిపించడం, ముఖ్యంగా జ్వరంలో వున్న నన్ను 'నీ యిష్టం ఏమిటి బోడి యిష్టం' అన్నట్లు బలవంతాన మీ కోర్కె తీర్చు కోవడం....అవును....శాడిజం....ఓహ్....ఇది కూడ వుందా! భగవంతుడా, నాకెంత శిక్ష విధిం చావు! నేనేం పాపంచేసానని ఇతని పాలిట పడేస్తావు!

భార్య అంటే మీ దృష్టిలో బానిస. దానికి యిష్టాయిష్టాలు వుండకూడదు. మనసనేది అసలు వుండకూడదు. భార్య వంటచేసే వంటలక్క. ఇంటిని కానే కావలా కుక్క. కోరికతీర్చే మాంసం ముద్ద. అంతేకదూ!

నా ఆశలన్నీ పుట్టబోయే పాప మీదే పెట్టుకుని ఎలాగో రోజులు నెట్టుకొస్తున్నాను.

నెలలు నిండాయి.

పండంటి బాబు పుట్టాడు. బాబుకి నా రంగు వచ్చింది. ఎర్రగా బొద్దుగా బాగా ముద్దొస్తున్నాడు.

ఇప్పుడిప్పుడే వాడు బోర్లాపడుతున్నాడు.

వాణ్ణి మీరు ఎత్తుకుంటారు. నిజమే. కాని కొడుకుపట్ల ఒక తండ్రికి వుండాల్సినంత ప్రేమ, వాత్సల్యం మీ కళ్ళలో నేను చూడలేదు. తన తత్వమే అంత. కొత్తేముంది — అనుకున్నాను.

కాని వాడిపట్ల కూడ మీరు జెలసీ, ద్వేషం పెంచుకుంటున్నారని వూహించలేకపోయాను.

చివరికి....మొన్న ప్రొద్దుట....వంట హడా వుడిలో వున్నాను నేను. ఓ ప్రక్క బాబు ఏడుస్తున్నాడు. మీరు తాపీగా పేపర్ చదువు కుంటున్నారు.

"వాణ్ణి కాస్త ఎత్తుకోండి" అన్నాను.

మీరు వినిపించుకోలేదు.

చెప్పిచెప్పి, చివరికి పనిలోంచి వచ్చి వాణ్ణి తీసుకొచ్చి మీ ఒళ్ళో పడేసి "మీ కొడుకుని కాసేపు ఆడించలేరా" విసుగ్గా అన్నాను.

"ఏమిటీ వెధవగోల"

వంట కాలేదని అసలే విసుగ్గా వున్న నేను "వెధవగోలేమిటి? వంటపని పిల్లాడిపని ఒక్క సారి నేనెలా చూసేది? వాడిని ఎత్తుకుంటే ఇప్పుడు మీకేమౌతుందంట" అన్నాను.

"నా కనవసరం" అన్నారు మీరు.

నాకు తిక్కరేగింది. "అనవసరమా? అనవసరం ఏమిటండీ? వాడు ఏడ్చిఏడ్చి ప్రాణం వుగ్గబట్టుకుపోతే" అన్నాను.

"పోనీ. పీడా వదుల్తుంది" అన్నారు తేలిగ్గా.

విర్ఘాంతపోయాను.

"మీ.....మీ.....కన్నకొడుకుని....." నేను మాటలు పూర్తిచేయలేకపోయాను.

"హూ. కన్నకొడుకు. ఎవడికి తెలుసు! ఎవడికి కన్నావో" పేపర్ పడేసి లేచి వెళ్ళ బోయారు మీరు.

నా కళ్ళవెంట నిప్పులు కురుస్తున్నాయి. కోపంతో నా పెదవులు అదిరిపోతున్నాయి. వెళ్ళ బోతున్న మిమ్మల్ని చొక్కా పట్టి లాగాను. నా వైపు త్రిప్పి "ఏమిటీ...మళ్ళీ అనండీ.... ఎవడికి కన్నానోనా" అన్నాను ఆవేశంగా.

ఎన్నాళ్ళనుంచో మీ మనసులో దాచుకున్న విషాన్ని కక్కారు.

"అవును. ఎవడికి కన్నావో. నీ ఎర్రతోలుతో పుట్టాడుగా! ఆ కళ్ళు, ముక్కు అంతా నీ పోలికే నా పోలికలు అసలు వాడిలో వున్నాయా?"

నాలో సహనం పూర్తిగా ఇంకిపోయింది. మీ మీద కొద్దోగొప్పో మిగిలిన ప్రేమ, గౌరవం తుడిచిపెట్టుకుపోయాయి.

"ఛీ. నువ్వసలు మనిషివి కావు. నీలో మానవత్వం కొద్దిగానైనా వుందేమో నన్న నా ఆశ పూర్తిగా పోయింది ఈ రోజుతో. నీతో జీవితం పంచుకుని, నువ్వెన్ని కష్టాలు పెట్టినా మౌనంగా భరించి, నిన్ను మనిషిని చెయ్యాలని ప్రయత్నించిన నన్నా నువ్వింత మాట అన్నది! చివరికి నీ కన్న కొడుకు మీద కూడా యింత కుళ్ళు పెంచు కున్నావా? నువ్వు పశువ్వి. కాదు కాదు. నోరులేని పశువులు కూడా తమ సంతానాన్ని ఎంతో ప్రేమిస్తాయి. నువ్వు పశువుకంటే అధమాధ ముడివి" అన్నాను అసహ్యంగా.

ఒక్క క్షణం ఊహించని ఆ పరిణామానికి విస్తుపోయారు మీరు. వెంటనే నా దగ్గరకి వచ్చి "ఏమన్నావ్" అంటూ నన్ను వంగదీసి కసిదీరా బాది బాది వదిలిపెట్టారు. చివరికి క్రిందపడిపోయిన నన్ను తన్నుకుంటూ బైటికి వెళ్ళిపోయారు.

అయిపోయింది. ఇక మనమధ్య బంధం తెగిపో యింది. నీలాటి నికృష్టుడి దగ్గర పడివుండే కంటే స్వతంత్రంగా మనశ్శాంతితో, ఆత్మ విశ్వాసంతో బతకడం మేలు. వెంటనే నాలుగు చీరలు సర్దుకుని, బాబుని తీసుకుని వచ్చేసాను నీ యింటినుంచి.

నా స్నేహితురాలి దగ్గరకి వచ్చేసాను. ఇక్క డేదో కాన్వెంటులో టెంపరరీ ఉద్యోగం వచ్చేలా వుంది. ఏదో ఒకటి. నీ దగ్గరలా ప్రతిక్షణమూ ఆత్మని చంపుకుంటూ బ్రతకక్కరలేదు. అందుకే ఈ సంఘానికి భయపడదలుచుకో లేదు. ధైర్యంగా నా బాబుని పెంచుకుంటాను. నీ నీడ కూడా వాడి మీద పడకూడదు. మంచి వ్యక్తిత్వం గల ఉత్తమ మైన వ్యక్తిగా వాడిని తీర్చిదిద్దుకుంటాను.

ఈ లోకంలో నేనొక్కదాన్నే దురదృష్ట వంతు రాలిని కాదు. నన్ను మించిన కష్టాలు అనుభవిం చిన వాళ్ళున్నారు. ఎంతమంది వెనక ఎన్ని కన్నీటి కథలు! ఎన్ని దీనాలాపనలు! చాలామంది దౌర్భాగ్య స్త్రీల వెనుక వున్నది మగవాడి అహంకారమే, మగవాడి దౌర్భాగ్యమే! మగవాడి మోసం, కుతం త్రమే! ఎందుకు—ఎందుకు మీరిలా ఆడవాళ్ళని హింసిస్తారు? అయితే ఈ హింస పెట్టడంలో కూడా ఒక్కో మగవాడు ఒక్కో పద్ధతి అవలంబి స్తాడు. అబ్బ ఏం మగవాళ్ళండీ! నిజంగా, మగ వాళ్ళూ! మీకు జోహార్లు!!

మిస్టర్ బాలసుబ్రహ్మణ్యం, నేనిలా ధైర్యం చేస్తానని నువ్వు కలలో కూడా వూహించి వుండవు. గదిలో బంధించి హింసిస్తే పిల్లి కూడా పులిలా మారుతుంది. ఇక మనిషినైన నేను ఎలా సహించ గలను! ఇక నీకూ నాకూ ఎలాంటి సంబంధమూ లేదు. కాని నువ్వు ఒక్కటి గుర్తుంచుకో. మరో స్త్రీని యిలా గొంతు కోయకు. ఇంకే స్త్రీ జీవి తాన్నీ నరకం చేయకు. ఇకనైనా మనిషిగా ఆలో చించి, మానవత్వంతో బ్రతకడం నేర్చుకో. పశుత్వం లోంచి మానవత్వం లోకి అడుగు పెట్టిన మానవుడు, దాన్ని కూడా మించి దివ్యత్వం వైపు పయనించాలి. కాని రాక్షసత్వం లోకి జారిపో కూడదు. మనుష్యుల్ని ద్వేషించడం మానుకో. ప్రేమించు. విశ్వప్రేమలోంచి ఉత్తమ వ్యక్తిత్వం అలవర్చుకో.

చెప్పాలంటే ఇంకా ఎన్నో ఎన్నో సంఘటనలు న్నాయి. కాని అవన్నీ నేను ఏకరువు పెట్టేకంటే నువ్వే ఒక్కసారి వెనక్కి తిరిగి నీ జీవితాన్ని పరిశీలన చేసుకో.

గుడ్ బై.

నీ భార్యకాని భార్య

సుజాత.